క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ పునరుద్ధరణ



ఉయ్యాలవాడలోని 4వ అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్‌ను పునరుద్ధరించిన దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఆ శాఖ ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ హుసేన్‌బాషా సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పట్లో విద్యుత్ కనెక్షన్లను తొలగించామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 20 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని చెప్పారు.

షేక్షావలి రెడ్డికి ఉత్తమ చాత్రాలయ అవార్డు



అవార్డును అందుకున్న షేక్షావలిరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): సుచిర్ ఇండియా ఫౌండేషన్ అందించిన ఉత్తమ చాత్రాలయ పురస్కారం అవార్డును పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి అందున్నారు. ఈనెల 16న హైదరాబాద్‌లోని లలిత కళాతోరణంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో వరుసగా రెండోసారి ఉత్తమ డైరెక్టర్‌గా చాత్రాలయం పురస్కార అవార్డును ఫౌండేషన్ చైర్మన్ కిరణ్‌కుమార్, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ప్రముఖ సినీ యాక్టర్ రావు రమేష్ నుంచి అందుకున్నట్లు గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి సోమవారం తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఉత్తమ డైరెక్టర్‌గా ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. సోమవారం శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో అకౌంట్ ఎగ్జికీటీవ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు 3 నెలల శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్మీడియెట్ ఆపై చదివి ఆసక్తి గల వారు ఈ నెల 25వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. విద్యార్హతల పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలు అందజేయాలని,శిక్షణ అనంతరం ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికెట్ అందజేస్తామని వివరించారు.

బెల్ట్ గ్రాడ్యుయేషన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): స్థానిక శ్రీశైల స్కూల్‌లో నంద్యాల జిల్లా సైకి మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా ఆధ్వర్యంలో సోమవారం సైకి, కరాటే బెల్ట్ గ్రాడ్యుయేషన్ బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. పోటీలకు నంద్యాల జిల్లాలోని 120మంది విద్యార్థులు పాల్గొని పసుపు, నారింజ, ఆకుపచ్చ బ్లూ, అండ్ బ్రౌన్ బెల్ట్‌లు సాధించారని కార్యదర్శి నూర్‌బాషా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సైకి అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నబిరసూల్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా కర్నూలు జిల్లా సైకి అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అబ్దుల్లా, నంద్యాల జిల్లా సభ్యుడు జాఫర్‌నాయక్ వ్యవహరించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



నిమింషాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పార్క్ రోడ్డులో వెలసిన శ్రీ నిమిషాంబా దేవి ఆలయం తొమ్మిదవ వార్షికోత్సవం వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఆలయ అధ్యక్షుడు వెంకన్న వర్మ అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన చేపట్టారు. అమ్మవారికి దర్శించుకోవడానికి పట్టణ ప్రజలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల భక్తులు తరలివచ్చారు. నిర్వహకులు అశోక్, అనంత్, మాధవ, సురేష్, కుమార్, కిరణ్, సాయివర్మ తదితరులు పాల్గొన్నారు.



ఈ బాలిక పేరు నాగలక్ష్మి. నర్సాపురం ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు ధనలక్ష్మి, సుబ్బరాయుడు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. బడిలో మధ్యాహ్న భోజనం బాగా లేకపోతుండటంతో ఇంటి నుంచి బాక్స్‌లో తెచ్చుకుని మధ్యాహ్నం తింటోంది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం ఇంట్లో వేసిన దోశలను తెచ్చుకొని తింటున్నానని చెబుతోంది.

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విద్యార్థులకు కనీసం మధ్యాహ్న భోజనం కూడా నాణ్యంగా వడ్డించ లేకపోతోంది. వైఎస్సార్‌సీపీలో జగనన్న గోరుముద్ద పథకం కింద చిన్నపాటి ఫిర్యాదులు లేకుండా ప్రత్యేక మెనూ అమలు చేస్తూ, నాణ్యమైన పౌష్టికాహారం వడ్డించేవారు. ప్రస్తుతం పౌష్టికం మాట అటుంచితే నాణ్యత దైవాదీనం అన్నట్లుగా తయారైంది. అన్నంలో పురుగులు వస్తున్నాయని చెబుతున్నప్పటికీ నిర్వాహకుల హుంకరింపుతో పిల్లలు మారుమాట్లాడలేక పోతున్నారు. అన్నీ తెలిసినప్పటికీ హెచ్‌ఎం నోరు మెదపడం లేదు.

ఈ భోజనం మాకొద్దు సారూ!

- జొన్న సంగటిని తలపిస్తున్న వెజిటబుల్ రైస్
- సగానికి పైగా మిగిలిపోతున్న మధ్యాహ్న భోజనం
- తిని కడుపునొప్పితో బాధపడుతున్న బాలలు
- అన్నంలో పురుగులు వస్తున్నాయంటున్నా పట్టించుకోని నిర్వాహకులు
- ఇంటి నుంచి క్యారియర్ తెచ్చుకుంటున్న విద్యార్థులు
- సమస్యపై ప్రశ్నించలేని హెచ్‌ఎం





నర్సాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న వెజిట బుల్ రైస్, వండిన దాంట్లో సగానికి పైగా మిగిలిన భోజనం, తినలేక పోతున్నామని చెబుతున్న విద్యార్థులు

రుద్రవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులందరూ కడుపునిండా తినేవారు. ప్రత్యేక మెనూ రూపొందించి రోజుకో రకం వంటకంతో నిర్వాహకులు వంటలు చేసి వడ్డించేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అంతా తారుమారైంది. ఏజెన్సీ నిర్వాహకులు మారడం, వంటలు సరిగా చేయలేక పోవడం, నాణ్యత పాటించకపోవడంతో ఆ వంటలు తిన్న విద్యార్థులు అజీర్తితో అలమటిస్తున్నారు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే.. వడ్డించిందే తినాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో విద్యార్థులు కడుపు నిండా భోజనం తినలేక పోయే దృశ్యాలు కళ్ల ముందే జరుగుతున్నప్పటికీ నోరు మెదపలేని పరిస్థితి హెచ్‌ఎంలది. రుద్రవరం మండలం నర్సాపురం ఉన్నత పాఠశాలలో సోమవారం పరిశీలించగా మధ్యాహ్న భోజన తీరు బట్టబయలైంది.

ఇంటి వద్దే వంట..

మండలంలోని నర్సాపురం ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 284 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉదయం తరగతులు మొదలవ్వగానే ఉపాధ్యాయ బృందం విద్యార్థుల హాజరు అనంతరం హెచ్‌ఎం వంట నిర్వాహకులకు సమాచారం అందించి మధ్యాహ్న భోజనం తయారు చేయాలని చెబుతారు. స్థానికంగా వంట గది లేక పోవడంతో నిర్వాహకులు ఇంటి వద్ద వంట తయారు చేసుకొని పాఠశాలకు తీసుకొచ్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

అన్నంలో పురుగులు..

కొద్ది రోజులుగా అన్నంలో చెక్క పురుగులు, వెంట్రుకలు వస్తున్నాయని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. పలువురు విద్యార్థులు సమస్యను హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లగా.. వాటిని తీసేసి తినండిరా అని చెబుతున్నారని చెప్పారు. ఇందులో భాగంగా సోమవారం మెనూ ప్రకారం వెజిటబుల్ రైస్, గుడ్డు కూర చేయాల్సి ఉంది. అయితే నిర్వాహకులు చేసిన వెజిటబుల్ రైస్ జొన్న సంగటిని తలపించేలా ముద్దగా ఉంది. భోజనంపై విద్యార్థులను ప్రశ్నించగా.. గుంపులు గుంపులుగా చేరి తామ భోజనం తినలేమని, ఇళ్ల వద్ద నుంచి క్యారియర్ తెచ్చుకొని తింటున్నామని వాపోయారు. వంట సరిగా చేయడం లేదని, ఒక రోజు బియ్యం బియ్యంలాగా, ఇంకో రోజు మెత్తగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం తిన్న అరగంటకే కడుపులో నొప్పి వస్తోందని విద్యార్థులు లబోదిబోమంటున్నారు. ఇక్కడి తిండి తినలేకే ఇంటి నుంచి తెచ్చుకొని తింటున్నామని, అందుకే వండిన భోజనం సగానికి పైగా మిగిలి పోతోందని చూపించారు.

ఏజెన్సీని మార్చాలని సూచించాం

విద్యార్థులు చెప్పింది వాస్తవమే. ఇటీవల పేరెంట్స్ మీటింగ్ నిర్వహించినప్పుడు కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు భోజన నాణ్యతను ప్రస్తావించడంతో వారికి ఏజెన్సీ నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రస్తుత నిర్వాహకులను మార్చమని గ్రామ పెద్దలకు చెప్పాం. చాలా మంది విద్యార్థులు తిన్న తరువాత కడుపులో నొప్పిగా ఉంటుందని చెబుతున్నారు. – రాజ్యలక్ష్మి, హెచ్‌ఎం

బాలల సంరక్షణ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించండి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం, 2015 ప్రకారం బాలల సంరక్షణ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పిల్లల సంరక్షణ కేంద్రాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఉన్న పిల్లలు బాలల సంరక్షణ కేంద్రాల్లో ఉండడానికి వీలులేదని సంబంధిత పిల్లలు తల్లిదండ్రుల దగ్గరే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలబాలికలను వేర్వేరుగా ఉంచాలన్నారు. పిల్లలకు సరిపోయేలా టాయిలెట్లు, వసతి సౌకర్యాలు ఉండాలని చెప్పారు. గతంలో తాను స్టార్ సొసైటీ పిల్లల సంరక్షణ కేంద్రాన్ని తనిఖీ చేయగా..వందమంది పిల్లలకు రెండు టాయిలెట్లు ఉండడం గమనించానని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బర్త్ డే ఫంక్షన్‌లు, వివాహ వేడుకల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వడంపై పూర్తిగా ఆక్షేపించాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సర్వేలు పకడ్బందీగా చేపట్టండి

నంద్యాల: స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, మండల స్పెషల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అమలుపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చి పారిశుద్ధ్యం పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని రైతునగరం, చాపిరేవుల, బొమ్మలసత్రం, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ తదితర ప్రాంతాల్లో సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌ను ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేలు అధ్వాన రీతిలో ఉన్నాయని పకడ్బందీ సర్వేల గణనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 20,500 గృహాలకు హౌస్ హోల్డ్ జియో టాగింగ్ పెండింగ్‌లో ఉన్నాయని త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.ముఖ్యంగా నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్, బేతంచెర్ల మున్సిపాలిటీలో అధికంగా పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. ఉద్యోగుల మ్యాపింగ్‌కి సంబంధించి 492 మంది ఉద్యోగుల మిస్సింగ్ డేటా పెండింగ్‌లో ఉందని తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు సంబంధించి 30వేల యూనిట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కంప్యూటీకరణ పూర్తి చేయించాలన్నారు. సచివాలయ సిబ్బంది పనివేళల ఇన్, అవుట్ హాజరులో తేడా ఉన్నాయని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని కోరారు. బాల సంజీవిని యాప్‌లో 16వేల మంది చంటి పిల్లల ఆధార్ పెండింగ్‌లో ఉన్నాయని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లాధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌పై దాడి హేయం



అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

బొమ్మలసత్రం: నిజాలను పత్రికలో ప్రచురించిన పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన మక్కువ మండల ప్రజాశక్తి రిపోర్టర్‌పై టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడి చేయటం హేయమైన చర్య అని జర్నలిస్ట్ సంఘాల నాయకులు పేర్కొన్నారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబుకు జర్నలిస్టులు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం మస్తాన్ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో అధికార పార్టీ నాయకుల అవినీతి, అక్రమాలపై రామారావు కథనం రాశారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని వేణుగోపాల్..రామారావును పిలిపించుకుని దాడి చేసి తమపైనే వార్తలు ప్రచురిస్తావా..చంపుతామంటూ బెదిరించటం సరికాదన్నారు. జర్నలిస్టులు మధు, చంటి, ప్రదీప్, కుమార్, శరత్, విజయ్, శివరామ్, గణేష్, అరుణ్, జాషువా పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): గత ప్రభుత్వ హయాంలో సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పంద జీవోలను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఐసీడీఎస్ బలోపేతానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, డీఏ, కూరగాయల బిల్లులు విడుదల చేయాలంటూ నంద్యాల అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రియదర్శినికి వినతి పత్రం అందజేశారు. రమణమ్మ, లక్ష్మణ్, వెంకటలింగం, నిర్మల, గౌస్, సునీత, నాగరాణి పాల్గొన్నారు.

ఆ నలుగురు తప్ప..

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల నిర్లక్ష్యం
- హాజరైనట్లు రిజిస్టర్లలో సంతకం చేసి వెళ్లిపోతున్న వైనం
- అధికారులు లేక వెనుదిరుగుతున్న జనం



సమావేశంలో ఉన్న ఎంపీడీఓ, తహసీల్దార్, ఈఓఆర్డీ, హౌసింగ్ ఏఈ

గోస్పాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది.ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైతే.. ఆ సమయానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాల్సి ఉంది. గోస్పాడులో మాత్రం ఎవరు, ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి మాత్రం 11మంది మండల స్థాయి అధికారులు హాజరైనట్లు సంబంధిత రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. అయితే కార్యక్రమంలో మాత్రం తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్, ఎంపీడీఓ అమానుల్లా, ఈఓఆర్‌డీ నాగ అనసూయ, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ నాగశేఖర్ తప్ప మిగిలిన అధికారులు ఎవరూ అక్కడ కనిపించకపోవడం విశేషం.



హాజరైనట్లు రిజిస్టర్‌లో సంతకాలు చేసిన అధికారులు

27న ఉరుసు

శిరివెళ్ల: ఈ నెల 27 తేదీన స్థానిక శ్రీ హజరత్ సయ్యద్ షానేషావలి ఉరుసు నిర్వహించనున్నామని నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా 26న గంధం, 27న ఉరుసు, 28న జార్తలు జరగనున్నాయి. ఉరుసు రోజున నిర్వహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కారం

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏదైనా సమస్యలపై అర్జీ సమర్పించినప్పుడు వెంటనే క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అధికారులు వెళ్లి పరిష్కరించి బాధితులకు న్యాయం చేయవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. కొందరు అధికారులు నిర్లక్ష్యం చూపుతుండటంతోనే స్థానికంగా సమస్యలు పరిష్కారం లభించడం లేదని, దీంతో జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్‌కు అర్జీలు సమర్పిస్తున్నారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ, వెలుగు ఏపీఎం దాసు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి పాల్గొన్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల(అర్బన్):ఈనెల 22వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ మెంబర్లు, మండల శాఖల అధికారులు తప్పని సరిగా పాల్గొనాలని కోరారు.

నేడు ఆలయ ప్రథమ వార్షికోత్సవం

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు పంచాయతీ మజరా గ్రామమైన మూడురాళ్ళపల్లె గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి, సాయిబాబా, శ్రీగణపతి, శ్రీవీరభద్రస్వామి, శ్రీఆంజనేయ స్వామి ఆలయాల ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం గోపూజ, గణపతి పూజ, స్వస్తి వాచనం, మాతృకపూజ, ప్రధాన కలశ, నవగ్రహ, మంటపారాధన, అభిషేకం, జపాలు, గణపతి హోమం, రుద్రస్వాహకార హోమం, వాస్తు హోమం, నవగ్రహ హోమం, మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 11గంటలకు స్థానిక మున్సిపల్ హాల్‌లో చైర్మన్ మాబున్నిసా అధ్యక్షతన బడ్జెట్ అంచనాల గురించి సమావేశం ఉంటుందన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

శిరివెళ్ల: స్థానిక మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థులకు సోమవారం ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 153 మంది విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో దృష్టి లోపం గల విద్యార్థులకు అద్దాలు అందచేశామన్నారు. ప్రిన్సిపాళ్లు ఇస్రత్ బేగం, జ్యోతి పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

చాగలమర్రి: మండలంలోని మూడురాళ్ళపల్లె గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీఆంజనేయస్వామి, సాయిబాబా ఆలయాల ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పులి చిన్న ఓబుళరెడ్డి సోమవారం తెలిపారు. ప్రథమ బహుమతి హోండా షైన్ మోటారు సైకిల్ (125సిసి), ద్వితీయ బహుమతిగా హోండా షైన్ (100 సిసి) మోటారు సైకిల్, ఆ తరువాత వరుసగా.. రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు దాతల సహకారంతో అందజేస్తామన్నారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరికీ రూ.5వేల నగదును ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తామన్నారు. ఉదయం రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు చెల్లించాలని సూచించారు. వివరాలకు సెల్ 9866209294, 9391656076 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇరుముడితో శ్రీశైలం పయనం

గోస్పాడు: శివమాలధారుల దీక్ష కాలం పూర్తవడంతో సోమవారం మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూలేపల్లె, పసురపాడు గ్రామాల్లో శివదీక్షా పరులు ప్రత్యేక పూజల అనంతరం ఇరుముడి స్వీకరించి శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు యాత్రను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. 'పతాక'స్థాయికి

రుద్రవరం: జాతీయ జెండా ఏర్పాటులోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో మువ్వన్నెల జెండాను నేలకు సమాంతరంగా అంటే అడ్డంగా కట్టారు. ప్రాంతీయ పశు వైద్యశాలలో ఏడీ గిడ్డయ్య గత నెల 26న జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జెండాను తీసి భద్రపరచాల్సి ఉన్నప్పటికీ.. కార్యాలయ ప్రాంగణంలోని షెడ్డులో అడ్డంగా ఏర్పాటు చేశారు. అయితే పక్షులు,వానరాల ధాటికి జెండా చిరిగిపోయింది. అయినప్పటికీ తొలగించకుండా అలాగే ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రుద్రవరం ప్రాంతీయ పశువైద్యశాలలో అడ్డంగా ఏర్పాటు చేసిన జాతీయ జెండా

మార్మోగుతున్న గోవింద నామస్మరణ

రుద్రవరం: గోవింద నామస్మరణతో మండలంలోని పల్లెలు మార్మోగుతున్నాయి. పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తుల పల్లకీ ఏ గ్రామమేగిన ప్రజలు ఘన స్వాగతాలు పలుకుతున్నారు. పక్క గ్రామానికి పల్లకీ రాబోతుండగానే అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే సోమవారం ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామి వారు చిలుకలూరులో పలు తెలుపుల మీద కొలువు దీరారు. అక్కడి ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజా సామగ్రితో గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారి సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. రాత్రికి ఉత్సవ మూర్తుల పల్లకీ తిప్పారెడ్డిపల్లెకు రానుండటంతో స్వాగతం పలికేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేపట్టారు.



ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

టెన్నిస్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఆర్‌కే టెన్నిస్ అకాడమీలోనంద్యాల జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆర్‌కే అకాడమీ, క్రీడా భారతి ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ స్థాయి టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఓపెన్ డబుల్స్ 50, ప్లస్ డబుల్స్ విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి క్రీడా భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, టెన్నిస్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, నిర్వాహకులు డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, క్రీడా భారతి జిల్లా నిర్వాహకులు సుధాకర్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఓపెన్ డబుల్ విభాగంలో నంద్యాల జిల్లాకు చెందిన ఆర్‌కే అకాడమీ సభ్యులు సాయిచందన్, దస్తగిరిలు విన్నర్స్‌గా, రన్నర్స్‌గా ప్రకాశం జిల్లా అశోక్, షబ్బీర్ నిలిచారు. 50 సంవత్సరాల డబుల్ విభాగంలో విన్నర్స్‌గా అనంతపురం జిల్లా డాక్టర్ జోజిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి గెలవగా రన్నర్‌గా నంద్యాల జిల్లాకు చెందిన డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి నిలిచారు.

పంటలను కాపాడండి

- కేసీ కెనాల్ సబ్ చానల్‌కు నిలిచిన సాగునీరు
- పంటలు ఎండుదశకు చేరుకోవడంతో రైతుల ఆందోళన
- నీరు విడుదల చేయాలంటూ కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

నంద్యాల(అర్బన్): కేసీ కెనాల్ పొన్నాపురం సబ్ చానల్‌కు నీటి సరఫరా నిలివేయడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా నీటి సరఫరా ఆగిపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండు దశకు చేరుకోవడంతో పంట దిగుబడులపై ప్రభావం పడుతుందంటూ నంద్యాల మండలం చాపిరేవుల, కానాల, పాండురంగాపురం, పుసులూరు, బ్రాహ్మణపల్లె, మిట్నాల, చింతకుంట్ల, జూలేపల్లె, గుంతనాలతో, తేళ్లపురి గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.సాగునీరు విడుదల చేయాలంటూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు.

గ్రామాల రైతులకు సబ్ చానలే ఆధారం...

మండలంలోని 11 గ్రామాల రైతులకు సంబంధించి వేలాది ఎకరాలకు పొన్నాపురం నుంచి ఎస్.కూలూరు వరకు వెళ్లే సబ్ చానల్ కింద పంటలు సాగవుతున్నాయి. వేలాది ఎకరాల్లో మిరప, మినుము, జొన్న, మొక్కజొన్న, కంది, వరి తదితర పంటలు సాగవుతాయి. మిరప, మొక్కజొన్న పంటలకు ప్రస్తుతం సాగునీరు అవసరం ఉంది. వారం రోజులుగా నీటి విడుదల లేకపోవడంతో పంటలు వాడు దశకు చేరుకున్నాయి. ఏటా సాగునీరు సంవృద్ధిగా ఉండేదని, లస్కర్లు సబ్ చానల్ వెంట తిరిగి రైతులకు సాగునీరు అందించాల్సి ఉండగా లస్కర్లు, ఏఈల మధ్య సమన్వయం లేకపోవడంతో సాగునీరు అందడం కష్టతరంగా మారిందని రైతులు వాపోయారు. పంటలు చివరి దశలో ఉన్న సమయంలో సాగునీరు నిలిచిపోయిందని వెంటనే అందేలా చూడాలంటూ రైతులు మణిమోహన్‌రెడ్డి, నందిరెడ్డి, తిరుపతిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలసుబ్బారెడ్డి, చాంద్, హుసేన్, వెంకటరెడ్డి, మోహన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, హుసేనావలి, శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.